ఉత్తుత్తి కొనుగోలు కేంద్రాలు

- మండలంలో 20 వేల ఎకరాల్లో 70 వేల పుట్ల దిగుబడి
- ఇప్పటికి 226 పుట్లు మాత్రమే కొనుగోలు
- ఉత్సవ విగ్రహాల్లా మారిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ప్రచార ఆర్భాటం తప్ప ఫలితం శూన్యం



వరికోతలు

'రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.. దళారులను నమ్మి మోసపోవద్దు' అధికార యంత్రాంగం తరచూ చెబుతున్న మాటలివి. ఊరూరా కొనుగోలు కేంద్రాలైతే ఏర్పాటు చేశారు. అయితే రైతులెవరూ ఆ కేంద్రాల వైపు చూడటం లేదంటే కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

మనుబోలు: మండలంలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు గొప్పగా చెబుతున్నారు. అయితే ఎంత ధాన్యం కొనుగోలు చేశారంటే మాత్రం దిక్కులు చూస్తున్న పరిస్థితి ఉంది. ఆయా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా బహిరంగ మార్కెట్‌లో ధాన్యం పుట్టి ధర రూ.3 వేలు తక్కువగా ఉంది. అయినా రైతులు ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణం సవాలక్ష నిబంధనలు. కచ్చితంగా 17 శాతం మాత్రమే తేమ ఉండాలి. అయితే వరి కోత కోసిన వెంటనే రైతులు విక్రయించే ధాన్యంలో 21 నుంచి 22 శాతం వరకూ తేమ ఉంటుంది. 17 శాతం తేమ ఉండాలంటే ధాన్యాన్ని రెండు, మూడు రోజులపాటు ఆరబెట్టాలి. ఇది చాలామందికి వీలయ్యే పనికాదు. అలాంటి ఏర్పాట్లు చాలా గ్రామాల్లో అందుబాటులో లేవు. ఒకవేళ అవకాశం ఉండి ఆరబెట్టినా ధాన్యం బరువు తగ్గుతుంది. కూలీలు, రవాణా ఖర్చు అదనం. ఆరబెట్టిన ధాన్యం ఎత్తే క్రమంలో అక్కడక్కడా మట్టి పెళ్లలు ఉంటాయి. ఇవి ఉంటే కేంద్రాల్లో కొనుగోలు చేయరు. ఇదంతా చేసి విక్రయించినా మిల్లర్లు సకాలంలో అన్‌లోడింగ్ చేసుకుని నగదు చెల్లిస్తారన్న నమ్మకం రైతుల్లో లేదు. ఇన్ని ఇబ్బందుల నడుమ అనేకమంది పుట్టికి రూ.3 వేలు నష్టమైనా వచ్చిన కాడికి తెగ నమ్ముకుంటున్నారు. అందుకే వరి కోతలు చివరి దశకు చేరుకున్నా మండలంలో 13 కొనుగోలు కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకూ కేవలం 1,950 క్వింటాళ్లు (226 పుట్లు) మాత్రమే కొనుగోలు చేయగలగడం వాటి దుస్థితికి అద్దం పడుతోంది.

పడిపోతున్న ధరలు

దళారులు ధాన్యం ధరలను రోజురోజుకు తగ్గిస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో బీపీటీ రకం పుట్టి రూ.22 వేల నుంచి రూ.23 వేల వరకూ ఉంది. ప్రస్తుతం రూ.16 వేల నుంచి రూ.17 వేల మధ్యలో ధర ఉంది. రెండు వారాల క్రితం ఇదే ధర రూ.19 వేల వరకూ ఉండగా ప్రస్తుతం రూ.2 వేల నుంచి రూ.3 వేలు తగ్గిపోయింది. షుగర్ లెస్, కేఎన్‌ఎంలకు సంబంధించి కూడా రోజురోజుకు ధరలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం కేవలం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా ఆచరణ సాధ్యం కాని నిబంధనల్ని సడలించి నేరుగా కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తే తప్ప సమస్య పరిష్కారం అయ్యేలా లేదని పలువురు రైతులు చెబుతున్నారు.



మనుబోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం

అంతా బోగస్ ప్రచారం



అధికారులు చేసే ప్రకటనలన్నీ బోగస్. కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించే పరిస్థితి లేదు. పుట్టికి 860 కేజీలైతే కొనుగోలు కేంద్రాల్లో 950 కేజీలు తీసుకుంటున్నారు. నేను ధాన్యం విక్రయిద్దామని వెళ్తే ముందుగా మిల్లు వద్దకు పోయి వారికి చూపించి గోతాలు తెచ్చుకోవాలని చెప్పారు. అది కూడా నెల్లూరులో మిల్లులకు పరిమితి అయిపోవడంతో బాపట్ల వెళ్లాలన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు కూడా రైతులే భరించాలి. ఇవన్నీ సాధ్యం కావని తెలిసి ఇక్కడే తక్కువ ధరకు అమ్ముకున్నా.

– ఏలూరు శ్రీధర్‌రెడ్డి, రైతు, మనుబోలు

అప్పులపాలే..



గతంతో పోలిస్తే ఎరువులు, కూలీల ఖర్చు భారీగా పెరిగాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతోంది. ధాన్యం ధరలు మాత్రం గతేడాదితో పోలిస్తే పుట్టికి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ తగ్గాయి. ఇలా అయితే రైతులు అప్పులపాలవుతారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– ఆలూరు రాము, రైతు, యాచవరం

ఉపయోగం లేదు



కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించినంత మాత్రాన రైతులకు ఉపయోగం లేదు. ధాన్యం విక్రయించే క్రమంలో ప్రభుత్వం పెట్టిన నిబంధనల్ని సరళతరం చేయాలి. అలాగే ధాన్యంను మిల్లుల వద్ద వెంటనే అన్‌లోడింగ్ చేసుకుని వెంటనే నగదు చెల్లించే ఏర్పాటు చేయాలి.

– గుమ్మడి వెంకటసుబ్బయ్య, రైతు, ఎల్‌ఎస్‌పురం

సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించేందుకు రైతులు భయపడాల్సిన అవసరం లేదు. రవాణా ఖర్చులతోపాటు, గోతాలు కూడా మేమే అందజేస్తాం. నగదు కూడా ఒకటి రెండు రోజుల్లోనే చెల్లించే ఏర్పాటు చేశాం. రైతులు అపోహలు వీడి అనవసరంగా నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఏఓ జహీర్, మనుబోలు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దౌర్జన్యం



గాయపడిన వినయ్

బుచ్చిరెడ్డిపాళెం: కొత్త మినగల్లు దళితవాడలో వైఎస్సార్‌సీపీకి చెందిన నలుగురు కార్యకర్తలపై అదే కాలనీకి చెందిన కొందరు (టీడీపీకి చెందిన వారు) ఆదివారం దాడిచేశారు. వివరాల్లోకి వెళ్తే.. బొచ్చు వినయ్ అనే వ్యక్తికి భార్యతో చిన్నపాటి వాదులాట జరిగింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న టీడీపీ కార్యకర్త బుట్టి సుధీర్ వివాదంలో జోక్యం చేసుకోవడంతో అది రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. దీంతో సుధీర్ వర్గీయులైన చింతల రమేష్, చింతల శ్రీహరి, కాకాణి రమేష్, అనపల్లి నరేష్ అక్కడికి చేరుకుని వినయ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులు చేశారు. ఈ దాడిలో వినయ్‌తో పాటు రోహిత్, కౌషిక్, మోషేలకు కత్తిగాయాలు అయ్యాయి. దీంతో ఒక్కసారిగా కాలనీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గాయపడ్డవారిని బుచ్చి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

టీడీపీ కవ్వింపు చర్యలు



వైఎస్సార్ విగ్రహం వద్ద టీడీపీ జెండా

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద టీడీపీ జెండాను ఏర్పాటు చేయడం సరికాదని పార్టీ పట్టణాధ్యక్షుడు షాహుల్ ఆదివారం అన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన జెండా ఆవిష్కరణ పోల్‌పై టీడీపీ జెండాను ఎగురవేసి కవ్వింపు చర్యలకు పాల్పడటం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు స్పందించి వారి జెండాను తొలగించాలని, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పొదలకూరు: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం పేద ముస్లింలకు రంజాన్ కిట్లు, దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఎస్సై హనీఫ్ విచ్చేశారు. రంజాన్ సందర్భంగా దాతల సహకారంతో 200 కుటుంబాలకు రూ.1,000 నుంచి రూ.1,500ల విలువైన వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మతగురువు మౌలానా ముస్తాక్ మదనీ, మైనారిటీ నాయకులు జమీర్‌బాషా, మహ్మద్ అబ్బాస్ షరీఫ్, షేక్ దస్తగిరి, టీపీఎస్ ఫయాజ్, షేక్ అహ్మద్ బాషా, మంజూర్, సుభాన్‌బాషా, ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



కోవూరు: స్థానిక సాయిబాబా మందిరం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. మందిర చైర్‌పర్సన్ పచ్చిపాల సుజాతమ్మ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, అర్చకుడు జగదీశ్ స్వామి పాల్గొన్నారు.

బుచ్చిలో ఆర్‌ఎస్‌ఎస్ మార్చ్‌ఫాస్ట్

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి పట్టణంలో ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) మార్చ్‌ఫాస్ట్ ఆదివారం నిర్వహించింది. ఈ సందర్భంగా వేములపాటి రవి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మార్చ్‌ఫాస్ట్ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతలు కేతరాజు కేశవరావు, బాలు సుబ్బారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మనుబోలు: మండలంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జట్ల కొండూరు ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం కోరారు. ఆదివారం ఆయన కొండూరులో మాట్లాడుతూ రేషన్‌కార్డులో నమోదై ఉన్న కుటుంబ సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిబంధన పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చిన్నారుల ఆధార్ అప్‌డేట్ కావడం లేదన్నారు. వారంతా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలంటే గూడూరు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయాలున్నా ఒక్కచోట కూడా ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడం దారుణమన్నారు. ఇకనైనా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రసన్నను కలిసిన వైఎస్సార్‌సీపీ నేత



ప్రసన్నకు పూలమొక్కను అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

ఇందుకూరుపేట: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆదివారం నెల్లూరులో కలిశారు. ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. పూలమొక్కను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గూడూరు పట్టణానికి చెందిన సుధీర్‌బాబు పని నిమిత్తం బైక్‌పై నెల్లూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కాకుటూరు సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో సుధీర్‌బాబుకు గాయపడగా స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక రేపు

కొడవలూరు : మండలంలో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై ప్రజా వేదిక కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం



ధ్రువీకరణపత్రాల అందజేత

ముత్తుకూరు: మత్స్య కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న బీఎఫ్‌ఎస్సీ విద్యార్థులు మండలంలోని మల్లూరులో చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్, కో–ఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. అధికారులు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

పేడూరు – చింతోపు లింక్ రోడ్డు బాగుపడేదెన్నడో!



అధ్వానంగా మారిన పేడూరు - చింతోపు లింక్ రోడ్డు

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు, మరమ్మతులకు రూ.కోట్లు వెచ్చిస్తున్నామని అధికార పార్టీ నాయకులు గొప్పలు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. మండలంలోని తీర ప్రాంతంలో పలు గ్రామీణ రహదారులు దారుణంగా మారిపోయినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో లింక్ రోడ్ల మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పేడూరు – చింతోపు లింక్ రోడ్డు వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే కొంత కాలంగా ఇది దుస్థితిలో ఉంది. గత వర్షాకాలంలో రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. గుల్లగుల్లగా మారడంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా గంగమ్మ ఉత్సవం



గంగమ్మ ఆలయంలో భక్తులు



విద్యుద్దీపాల వెలుగులో గంగమ్మ, మనుబోలమ్మ ఆలయాలు

మనుబోలు: ఉగాదిని పురస్కరించుకుని మనుబోలు మండల కేంద్రంలో గంగమ్మ ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువు గట్టునున్న గంగమ్మ, మనుబోలమ్మ ఆలయాలను, పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. గంగమ్మకు అర్చకుడు సుబ్రహ్మస్వామి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమాలకు యాదవ సంఘంతోపాటు బొమ్మిరెడ్డి ధనంజయరెడ్డి, ఉమ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై గంగమ్మ, మనుబోలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రి గంగమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వైభవంగా ఉగాది సంబరాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విశేషాలంకరణలో మల్లికార్జున సమేత కామాక్షితాయి

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం మజరా టపాతోపులోని విశ్వజనని అనాథ బాలల ఆశ్రమంలో జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఆశ్రమానికి బియ్యం, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పండ్లు ఇచ్చారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ దాసరి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వారి పండగలు, సంస్కృతి, సాంప్రదాయాలు పిల్లలకు తెలియజేసేందుకు ఆశ్రమంలో ఉగాది సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ తరఫున జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, సంచార జాతులకు దుప్పట్లు పంపిణీ చేయడం, బాలలు, వృద్ధుల ఆశ్రమాల్లో దుస్తులు పంపిణీ చేయడం, వినాయక చవితికి మట్టి ప్రతిమలు పంపిణీ చేయడం లాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

- విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మండలంలో ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ప్రజలు తెలుగు సాంప్రదాయ ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. దీంతో మండలంలోని అమ్మవార్ల ఆలయాల్లో సందడి నెలకొంది.
- **పొదలకూరు:** తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా చేసుకున్నారు. పట్టణంలోని సాయిబాబా మందిరం, రామమందిరం, శివాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు.
- శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం పల్లకి సేవ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట :** ఉగాది పర్వదినాన్ని మండలవాసులు ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- **కోవూరు :** ఉగాది పర్వదినం సందర్భంగా పడుగుపాడు గ్రామదేవత చింతాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామిరెడ్డి గజేంద్రరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.
- **తోటపల్లిగూడూరు:** ఉగాది సందర్భంగా ఆదివారం మండలంలోని వరిగొండ జ్వాలాముఖి ఆలయం, పేడూరు చాముండేశ్వరి ఆలయం, నరుకూరు రాజరాజేశ్వరి ఆలయం, కోడూరులోని ముక్కంటమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కోడూరులోని ముక్కంటమ్మ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తుళ్లూరు శేషు – మాధవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జొన్నవాడలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో ఆదివారం విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను అలంకరించి గ్రామంలో ఊరేగించారు. దేవాలయ పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కోలాటం, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంగారు గొలుసు బహూకరణ

శ్రీకాళహస్తికి చెందిన మీనాక్షి ఆదివారం 11 గ్రాముల బంగారు గొలుసును అమ్మవారికి సమర్పించారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం:** స్థానిక కనిగిరి రిజర్వాయర్ వద్దనున్న పోలేరమ్మకు భక్తులు 108 కలశాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే పెద్దూరు కోనేటిమిట్టలో పోలేరమ్మకు నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. కనిసిరిపాళెం గిరిజన కాలనీలో కూడా అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించారు. రేబాలలోని పుట్టాలమ్మకు బంగారు చీర అలంకారంలో ఊరేగింపు నిర్వహించారు.



బుచ్చిరెడ్డిపాళెం : పుట్టాలమ్మ ఊరేగింపు



కోవూరు : చింతాలమ్మ ఆలయంలో అన్నదానం



కొడవలూరు: విశ్వజనని బాలల ఆశ్రమంలో ఉగాది సంబరాలు



టీపీగూడూరు: అమ్మవారి గ్రామోత్సవం